సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం | 3 | జూన్ | 2023



ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

నిషేధిత సీపీఐ మావోయిస్టులను అరెస్ట్ చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు.

- 8లో ▸



రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$43^0/28^0$

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రిళ్లు ఉక్కపోత ఉంటుంది.

న్యూస్‌రీల్

సీపీ కార్యాలయంలో జెండావిష్కరణ



నయింనగర్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీ ఏవీ రంగనాథ్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం చిన్నారులకు, సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు.

నేటి నుంచి రేషన్ షాపులు బంద్

హన్మకొండ అర్బన్ : సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు సంఘం జిల్లా నాయకుడు గౌరీశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రేషన్‌షాపులు బంద్ పాటిస్తామని పేర్కొన్నారు. చాలీచాలని కమీషన్లతో తమ బతుకులు అధ్వానంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి రేషన్ డీలర్ సమ్మెలో పాల్గొంటాడని, లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

విద్యారణ్యపురి : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించిన విద్యార్థులకు ఈ నెల 5 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) గోపాల్ శుక్రవారం తెలిపారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ కళాశాలల్లో హాల్‌టికెట్లు తీసుకొని పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

నేటినుంచి ట్రాఫిక్ మళ్లింపు

రామన్నపేట : వరంగల్‌లోని (ఏడు మోరీలు) పోతన జంక్షన్-మేదరి వాడ రోడ్డు మరమ్మతులు జరుగుతున్నందున ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ బాబులాల్ తెలిపారు. శనివారం నుంచి ఈనెల 10 వరకు వాహనాలను మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండలోని అదాలత్ జంక్షన్, హంటర్ రోడ్డు, పోతన రోడ్డు మీదుగా వరంగల్ రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌కు వెళ్లే వారు ఎంజీఎం, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్ మీదుగా వెళ్లాలని ఆయన తెలిపారు. అలాగే, వరంగల్ రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ నుంచి అండర్ బ్రిడ్జి, హంటర్ రోడ్డు మీదుగా అదాలత్ జంక్షన్ వైపు వెళ్లే వారు వరంగల్ చౌరస్తా, పోచమ్మమైదాన్ మీదుగా హనుమకొండకు వెళ్లాలని సీఐ సూచించారు.

నేటి నుంచి 'బడిబాట'

విద్యారణ్యపురి/కాశిబుగ్గసెంటర్ : హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శనివారంనుంచి 9వ తేదీ వరకు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను గుర్తించి ఎన్‌రోల్‌మెంటు చేయాలని, అందుకు గాను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లాలో 20మంది లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలు, 50 మంది లోపు విద్యార్థులున్న హైస్కూళ్లతో కలిపి మొత్తం 149 పాఠశాలలు ఉన్నట్లుగా విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వీటిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. హనుమకొండ జిల్లాలో 780 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, 9,950 మంది పిల్లలున్నట్లు గుర్తించారు. వారందరిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్పించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లాలోప్రాథమిక పాఠశాలలు 460, ప్రాథమికోన్నత పాఠశాలలు 65, హైస్కూళ్లు 125 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 50,735 మంది విద్యార్థులున్నారు. ఈసంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.

సబ్బండ వర్గాల్లో సుఖసంతోషాలు

- ప్రజా జీవితాల్లో గుణాత్మక మార్పు
- అభివృద్ధిలో మోడల్‌గా నిలిచాం
- అన్ని రంగాల్లో ఫలాలు
- మానవ సమాజానికి పాఠాలు నేర్పాం
- తెలంగాణ అవతరణ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



హన్మకొండ అర్బన్: స్వరాష్ట్రం, స్వపరిపాలనలో తెలంగాణలోని ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు వచ్చాయని, సబ్బండ వర్గాల్లో సుఖసంతోషాలు వెల్లివిరుస్తున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. స్వరాష్ట్రం కల సిద్ధించి తొమ్మిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ముందుంచేందుకు 21రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదట పతాకావిష్కరణ చేసి పరేడ్ వందనం స్వీకరించారు. అనంతరం తొమ్మిదేళ్ల కాలంలో వివిధ రంగాల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యమనేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా తొమ్మిదేళ్లలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించారన్నారు. తద్వారా దేశానికే రాష్ట్ర రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధన, అభివృద్ధి వంటివి సమాజానికి కొత్త మార్గం చూపుతున్నాయన్నారు.

- హనుమకొండ జిల్లాలో 55రైతు వేదికలు ఏర్పాటు చేసుకున్నామని, 178రైతుబంధు సమితుల ద్వారా రైతులకు చేరువై వారికి అండగా ఉంటున్నామన్నారు.
- పౌరసరఫరాల శాఖ ద్వారా 2,28,216 మంది కార్డుదారులకు, 110 సంక్షేమ హాస్టళ్లకు 2014 నుంచి నేటివరకు సన్నబియ్యం అందజేస్తున్నామన్నారు.
- 669 ధాన్యం కేంద్రాల ద్వారా కొనుగోలు సాగుతోందన్నారు.
- రెండు మార్కెట్ కమిటీల పరిధిలో రూ.21 కోట్లతో భారీ సామర్థ్యంగల గోదాములు నిర్మించామన్నారు.
- వివిధ పథకాల ద్వారా 10,930మంది లబ్ధిదారులకు రూ.42.44కోట్లు అందించామన్నారు. జిల్లాలో కార్మిక ఉద్యోగ మాసోత్సవాల పేరుతో విస్తృత్న కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో కార్మిక భవనం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.
- మన ఊరు మనబడి, మనబస్తీ - మనబడి వంటి కార్యక్రమాలు చేపట్టామని, మొదటి దశలో 176స్కూళ్ల రూ.85కోట్ల అంచనాతో పనులు చేపట్టామని వివరించారు.
- జీఓ 58ద్వారా 714దరఖాస్తులు రాగా అర్హులుగా గుర్తించిన 394 మందికి పట్టాలు అందజేసినట్లు తెలిపారు.
- హరితహారంలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 11.65 లక్షల మొక్కలు నాటామన్నారు.
- దళితబంధు ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 4,180 మంది లబ్ధిదారులకు రూ.413.82 కోట్లు ఖాతాల్లో జమ చేశామన్నారు. కంటి వెలుగు ద్వారా ఈ ఏడాదిలో జరిగిన రెండవ విడత ద్వారా 4.28 లక్షల మందికి కంటి పరీక్ష నిర్వహించి 61వేల మందికి రీడింగ్ కళ్లద్దాలు, 28,477 మందికి ప్రిస్క్రైబ్డ్ కళ్లద్దాలను పంపిణీ చేసినట్లు వివరించారు.
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో 5 ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ప్రారంభమయ్యాయని, ఇందులో ఇప్పటివరకు 6,850 మంది పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.
- ముఖ్యమంత్రి హామీ పథకం ద్వారా రూ.93.96 కోట్లు, అండర్ బ్రిడ్జిలు, ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.251.23 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.
- పారిశ్రామికంగా, గొర్రెల పంపిణీ పథకం, మత్స్యశాఖ, మెప్మా ద్వారా చేపట్టిన పనులను వివరించారు.

అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తెలంగాణ అమర వీరుల కుటుంబ సభ్యులను సత్కరించి వారి త్యాగాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న చీఫ్‌విప్ వినయ్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్ తదితరులు



బెలూన్లను ఎగురవేస్తున్న అతిథులు



తెలంగాణకు ఉజ్వల భవిష్యత్

- నీళ్లు, నిధులు, నియామకాలతో అమరులకు నిజమైన నివాళులు
- మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్
- వరంగల్‌లో అంబరాన్నంటిన 'అవతరణ' సంబరాలు



కరీమాబాద్/ఖిలా వరంగల్: 'సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం స్వర్ణయుగాన్ని తలపిస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్ ఉండేలా చేపట్టిన ప్రణాళికలన్నీ మంచి ఫలితాలిస్తున్నాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా చేసుకుంటున్నాం' అని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖిలా వరంగల్ పడమర కోటలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ అవతరణ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఖిలా వరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం వరంగల్ ఓ సిటీ సమీపంలోని ఐడీఓసీ నిర్మాణ స్థలంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవానికి మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో వరంగల్ కీలకపాత్ర పోషించిందన్నారు.

- నీళ్లు, నిధులు, నియామకాలతోనే వారికి నిజమైన నివాళులని చెప్పారు.
- వరంగల్ బిడ్డగా సీఎం కేసీఆర్ ఆశీస్సులతో దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.
- జిల్లా 2014-15లో తలసరి ఆదాయం రూ.82,084 కోట్లు ఉండగా.. 2020-21లో ఆదాయం రూ.1,71,111కోట్లకు పెరగడం స్వరాష్ట్ర పాలనకు నిదర్శనమన్నారు.
- పర్యాటక రంగంలో పాకాల సరస్సు, కొమ్మల శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయం, వరంగల్‌లో పురావస్తు ప్రదర్శనశాల అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.
- జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం గీసుకొండ, సంగెం మండలాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగుల ఉత్తమ సేవలకుగాను ప్రశంసపత్రాలు అందించారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్-23 పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వేదికపై సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్‌జీ, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, అడిషనల్ డీసీపీ సంజీ, ఏసీపీ బోనాల కిషన్, ఆర్డీఓ మహేందర్ జీ, తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, కార్పొరేటర్లు సువర్ణ, బైరబోయిన ఉమ, సిద్దంరాజు, మరిపెల్లి రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన 'సాంస్కృతిక' ప్రదర్శనలు

ఐడీఓసీ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. గీసుగొండ కేజీబీవీ, కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల, కొత్తవాడ ప్రగతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

స్టాల్స్ 'సందర్శన'

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా వేదిక ప్రాంగణంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు తెలిసేలా స్టాల్స్ ఏర్పాటు చేయగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు.



జెండాకు వందనం చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు..



పోలీస్‌వందనం స్వీకరిస్తున్న బండా ప్రకాశ్, కలెక్టర్ ప్రావీణ్య



రైతు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం (జూన్ 3న) జిల్లాలోని 55 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రైతు దినోత్సవ వేడుకలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 55 రైతు వేదికలను సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. ఉదయం గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో రైతులు రైతు వేదికల వద్దకు బతుకమ్మ, బోనాలతో, డప్పు చప్పులతో ఊరేగింపుగా రావాలన్నారు. ప్రతి రైతుకు వేదిక వద్ద రైతులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకల ఏర్పాట్ల పరిశీలన..

హసన్‌పర్తి: హసన్‌పర్తి రైతు వేదికలో నిర్వహించనున్న కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ఆమెవెంట కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్, ఏడీఏ దామోదర్‌రెడ్డి, ఎంపీఓ రవిబాబు, రైతుబంధు సమితి జిల్లాకో-ఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, ఏఓ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

హన్మకొండ : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 3న నిర్వహించనున్న రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ పిలుపునిచ్చారు. జిల్లాలోని 55 రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ ప్రావీణ్య



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: పరీక్షల నిర్వహణకు నియమితులైన అధికారులు విధులపై అప్రమత్తంగా ఉండాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఈనెల 11న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 24 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. ప్రిలిమ్స్ రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ప్రతీ సెంటర్‌లో సీసీ టీవీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్ష రాసే అభ్యర్థులంతా ఉదయం 10:15 గంటల కల్లా సెంటర్‌కు చేరుకోవాలని స్పష్టం చేశారు. లైజనింగ్ అధికారులుగా 24 మంది, రూట్ ఆఫీసర్లుగా ఆరుగురిని నియమించినట్లు తెలిపారు. పరీక్ష మొదలైనప్పటి నుంచి మెటీరియల్ కలెక్టరేట్‌కు చేరేవరకు లైజనింగ్ అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. పరీక్షకు 9,716 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, ఆర్డీఓ మహేందర్‌జీ పాల్గొన్నారు.

బెలూన్ల ప్రదర్శన



వరంగల్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ శతాబ్ది వేడుకల్లో భాగంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో గ్యాస్ బెలూన్లను ఎగురవేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో, హనుమకొండ కలెక్టరేట్, భద్రకాళీ బండ్, వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆకాశంలోకి బెలూన్లను ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు.

ఎస్ఎస్ఆర్‌లో ఓటర్ల పూర్తి సమాచారం సేకరించాలి

వరంగల్ తూర్పు ఈఆర్ఓ రిజ్వాన్ బాషా



బీఎల్ఓను వివరాలడుగుతున్న రిజ్వాన్ బాషా

వరంగల్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2023(ఎస్ఎస్ఆర్)లో ఓటర్ల పూర్తి సమాచారం సేకరించాలని వరంగల్ ఈఆర్ఓ, గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు సత్యపాల్‌రెడ్డి, ఫణికుమార్‌లతో కలిసి ఎస్ఎస్ఆర్-2023పై సూపర్‌వైజర్లు, బీఎల్ఓల పురోగతిని ఆయన సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఓటర్ ఇంటికి వెళ్లి వారి సంక్షిప్త సమాచారం సేకరించాలన్నారు. ఈ కార్యక్రమం మే 21నుంచి జూన్ 23 వరకు జరుగుతుందని తెలిపారు. ఓటరు తన నమోదులో ఏమైనా సవరణలు ఉంటే సేకరించాలని తెలిపారు.

సోనియమ్మ రుణం తీర్చుకుందాం..

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి, తెలంగాణ తల్లి సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండలోని డీసీసీ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, సుబేదారిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరులకు నివాళుర్పించిన అనంతరం నాయిని మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ కొందరి చేతిలో బందీ అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, డీసీసీ వరంగల్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, పులి అనిల్, బంక సరళ, బొమ్మతి విక్రమ్, కూర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బదిలీలకు వేళాయె

- జిల్లాలో భారీగా అధికారుల బదిలీలుండే అవకాశం
- నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి

హన్మకొండ అర్బన్: తెలంగాణ సహా దేశంలోని ఐదు రాష్ట్రాలకు సంబంధించి శాసన సభ సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. రాష్ట్రంలో అధికారుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మూడేళ్లకు మించి అధికారులు విధుల్లో ఉండవద్దని, రాజకీయ నాయకులతో బంధుత్వం ఉన్నవారు డిక్లరేషన్ ఇవ్వాలని, కేసులు నమోదైన వారు ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖలో ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులను, రెవెన్యూ అధికారులను సొంత జిల్లాల్లో ఉంచవద్దని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బదిలీల జాబితా సిద్ధం చేసినా 22న ఉత్సవాలు ముగిసిన తరువాత రిలీవ్ చేసే అవకాశం ఉంది.

కలెక్టర్ మినహా అధికారులందరూ బదిలీ?

హనుమకొండ జిల్లాలో కలెక్టర్ మినహా అధికారులందరూ దాదాపు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులవి కూడా భారీగా బదిలీలు ఉంటాయని తెలుస్తోంది. ఇక తహసీల్దార్లు పూర్తిగా జిల్లా వదలాల్సిన పరిస్థితి. గతంలో ఎన్నికలు ముగియగానే కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ఎక్కడివారు అక్కడికే అన్నట్లు వచ్చేవారు. ప్రస్తుతం శాసనసభ అనంతరం లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బదిలీ అయిన వారు కనీసం సంవత్సరంపాటు ఇతర జిల్లాలో చేయక తప్పని పరిస్థితి నెలకొంటుంది. మొత్తానికి జిల్లాల విభజన, జోనల్ వ్యవస్థ, 317జీఓలతో బదిలీలు అంటేనే హడలిపోతున్న ఉద్యోగులకు ఎన్నికల పేరుతో మరోసారి బదిలీ కుదుపునకు గురవుతున్నారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేసి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ గాష్ ఆలం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 01వ తేదీన విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వెంకటాపురం(కె) సర్కిల్ పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధం కలిగిన వ్యక్తులు పేలుడు పదార్థాలను అమర్చుతున్న క్రమంలో పట్టుకుని, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేశారు. పూజారి కాంకేర్ గ్రామం, ఊసూర్ బ్లాక్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మడిని దేవ మావోయిస్టు పార్టీ ఆర్‌పీసీ కమాండర్, మడకం ఊర సీఎస్ఎం కమాండర్‌గా పని చేస్తున్నారు. వెంకటాపురం(కె) మండల కార్యదర్శి సుధాకర్ ఆదేశాల మేరకు చెలిమెల అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలను అమర్చాలని ఆదేశించారు. దీంతో పేలుడు పదార్థాలు అమర్చుతున్న క్రమంలో పోలీసులు చాకచక్యంగా ఇద్దరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఓఎస్డీ అశోక్ కుమార్, సీఐ శివప్రసాద్, సీఆర్‌పీఎఫ్ ఎస్సై తిరుపతి రావు, పేరూర్ ఎస్సై హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



ఐనవోలు: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పంథిని గ్రామం చింతకుంటలో చోటు చేసుకుంది. ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి శ్రీనివాస్‌రెడ్డి(43) తనకున్న ఐదు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో సుమారు రూ.10లక్షలు అప్పు అయింది. పంటలు పండక, భూమి అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురై గురువారం గడ్డిమందు తాగగా.. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత, కుమార్తెలు ఆశ్రిత, హారిక ఉన్నారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుగులోతు వెంకన్న తెలిపారు.

వరంగల్‌లో నృత్యం చేస్తున్న యువతులు



హనుమకొండలో..



జనగామలో..



ఆవిర్భావ సంబురం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సాధించిన పురోగతిని వివరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



వరంగల్‌లో నిర్వహించిన ఆవిర్భావ వేడుకలో ప్రసంగిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



హనుమకొండలో అమరుల కుటుంబ సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



జనగామ: దుస్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



తెలంగాణ తల్లి వేషధారణ.. స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

రేపట్నుంచి ఎంసీపీఐ(యు) రాష్ట్ర ప్లీనరీ సభలు

హన్మకొండ: ఎంసీపీఐ (యు) రాష్ట్ర ప్లీనరీ సభలు నర్సంపేటలో ఈ నెల 4, 5, 6 తేదీల్లో జరుగుతాయని ఆ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ప్లీనరీ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌రెడ్డి హంసరెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేటలో జరిగే పార్టీ ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ప్లీనరీని పురస్కరించుకుని ఈ నెల 4న నర్సంపేటలోని బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి వరంగల్ రోడ్డు వరకు భారీ ఎర్రదండు ప్రదర్శన ద్వారా బహిరంగ సభకు చేరుకోనున్నట్లు వివరించారు. 5, 6 తేదీల్లో రెండు రోజులు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. ఈ ప్లీనరీ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, నాయకులు యాకమ్మ, హిందూ కళ్యాణి, రామ్మోహన్, రాధిక, మణిమాల, సరళ పాల్గొన్నారు.

రాష్ట్రం కుటుంబ పాలనలో బందీ

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

గీసుకొండ: ఎంతో మంది యువత, విద్యార్థుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ కుటుంబ పాలనలో బందీ అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతీ బీజేపీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు ఎడ్ల అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి హరిశంకర్, గుడిపెల్లి రాజేశ్వర్‌రావు, జిల్లా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, గంట రవికుమార్, వన్నాల వెంకటరమణ, రాదారపు శివకుమార్, గట్టికొప్పుల రాంబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగ తెలంగాణగా మార్చిన కేసీఆర్ : స్వర్ణ

గీసుకొండ: నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో రాష్ట్రం తెచ్చుకున్నామని, ఇవన్నీ సీఎం కేసీఆర్ కుటుంబానికే చెందాయని, రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత అనుకుంటే వారి ఆశలు నెరవేరలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కొనాయమాకుల క్రాస్ వద్ద రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు.

రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదాం

● పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ పూజ

మామునూరు: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల విధి నిర్వహణ సైతం తోడ్పడాలని, సమష్టిగా రాష్ట్ర శాంతిభద్రతలను కాపాడుదామని పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. ఖిలా వరంగల్ మండలం పోలీస్ ట్రెనింగ్ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పోలీసు శిక్షణ కళాశాలలో పరిపాలన భవనం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్ పూజ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు పుష్ప



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

గుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పోలీసు సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. బంగారు తెలంగాణ మన లక్ష్యమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ముందుకెళ్తూ.. రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, రమేష్, భిక్షపతి, పాండు నాయక్, ఏఎల్‌ఐలు రాధిక, సత్యనారాయణ, ఆర్‌ఐలు రాజేష్, చంద్రశేఖర్, దశరథం, నవీన్, సీఎల్‌ఐలు నరేష్, రవీందర్, డాక్టర్ సుధీర్, ఏఓ ఫర్హానా, పీఆర్‌ఓ రామచారి, 374 శిక్షణార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ ఆఫ్రీన్ సిద్ధిఖీ జాతీయ జెండాను ఆవిష్కరించగా.. ఎంవీఐలు రవీందర్, వెంకన్న, ఏఎంవీఐ శాలిని పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మసాగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హనుమకొండ మండలం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాజీపేట మండలం రాంపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొని తలపై నుంచి వెళ్లగా తల ఛిద్రమై మృతి చెందాడు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి పోలీసులు చేరుకున్నారు. అయితే మృతుని తల ఛిద్రమై గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ఒంటిపై తెలుపురంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాంపూర్ వీఆర్‌ఏ రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ..

కేసముద్రం: అజాగ్రత్తతో ఆటో నడపడంతో ఆటోలో ప్రయాణిస్తున్న కల్వల గ్రామానికి చెందిన గంట విజయ(45) మృతి చెందింది. విజయ మానుకోటకు వెళ్లేందుకు ఓ ఆటోలో ఎక్కింది. ఈక్రమంలో తాళ్లపూసపల్లి దాటాక ఆటో డ్రైవర్ యుగేందర్ అజాగ్రత్తగా ఆటో నడపడంతో ఆమె జారిపడింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందింది.

బండరాయి తలపై పడి యువకుడి దుర్మరణం

● పూడిక తీస్తుండగా ఘటన



పృథ్వి (ఫైల్)

రాయపర్తి: వ్యవసాయ బావిలో క్రేన్ సాయంతో పూడిక మట్టి తీస్తుండగా పైనుంచి బండరాయి తలపై పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొండూరు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామానికి చెందిన రూపాని నరహరి, యశోద దంపతులు, వారి కుమారుడు రూపాని పృథ్విరాజ్ (26) ముప్పై ఏళ్లక్రితం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామానికి వచ్చి వ్యవసాయక్షేత్రాల్లోని బావుల్లో క్రేన్ సాయంతో పూడిక తీతమట్టి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన నాగేశ్వర్‌రావు వ్యవసాయ భూమిలో బావిలో పూడిక మట్టి తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో ఉన్న పృథ్విపై బండరాయి పడింది. ఈ ఘటనలో పృథ్వి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల కోసం స్థానిక ఎస్సై బండారి రాజును వివరణకోరగా ఎలాంటి పిటీషన్ రాలేదని తెలిపారు.

నేడు, రేపు కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ పర్యటన

హన్మకొండ: కేంద్ర సహకార, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీ.ఎల్.వర్మ ఈ నెల 3, 4 తేదీల్లో హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి బీ.ఎల్.వర్మ పర్యటన వివరాలు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శుక్రవారం వెల్లడించారు. శనివారం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన ఉదయం 9 గంటలకు కాజీపేటలోని ఎన్ఐటీకి చేరుకుంటారు. అక్కడ అల్పాహారం చేసిన అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. 11.15 గంటలకు గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కును సందర్శిస్తారు. ఇక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.15కు భూపాలపల్లికి చేరుకుంటారు. 1.30కి బీజేపీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు వరంగల్‌కు చేరుకుంటారు. రాత్రి 7 గంటలకు పార్టీ సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం నిట్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు. ఈ నెల 4న ఉదయం 8 గంటలకు రామప్పకు చేరుకుంటారు. 9 గంటలకు ములుగుకు చేరుకుని అల్పాహారం స్వీకరించి అనంతరం పార్టీ సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11.45 గంటలకు నర్సంపేటలో జరిగే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఇక్కడి నుంచి హనుమకొండకు చేరుకుని 3.30 గంటలకు హరిత హోటల్‌లో అధికారులతో స్మార్ట్ సిటీ పనులపై సమీక్షిస్తారు. అనంతరం హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకుని ఢిల్లీకి బయల్దేరుతారు.


జేసీబీ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు శ్రీధర్

కాజీపేట అర్బన్: ద్విచక్రవాహనాన్ని జేసీబీ ఢీ కొట్టడంతో దర్గా కాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్(33) మృతి చెందిన ఘటన శుక్రవారం న్యూశాయంపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. సుబేదారి పోలీసులు, మృతుడి సోదరుడు పబ్బోజు శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గాకాజీపేటకు చెందిన పబ్బోజు శ్రీధర్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం శ్రీధర్ దర్గా కాజీపేట నుంచి వరంగల్‌కు హంటర్‌రోడ్డు మీదుగా తన ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. న్యూ శాయంపేట జంక్షన్‌కు చేరుకోగా ఎదురుగా వస్తు న్న జేసీబీ డ్రైవర్ పల్లెపు సందీప్ అతివేగంతో వచ్చి ఢీ కొట్టాడు. దీంతో శ్రీధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేర కు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దశాబ్ది ఉత్సవాల నోడల్ ఆఫీసర్‌గా హరిత



కలెక్టర్ సిక్తాతో హరిత

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల నోడల్ ఆఫీసర్‌గా విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ హరితను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం హైదరాబాద్ నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. హరితను కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, శ్రీవత్స కోట, అశ్విని తానాజీ వాకడేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా జిల్లాల్లో సమన్వయంతో పనిచేసి దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

బాలుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి సమ్మయ్యనగర్‌లో శుక్రవారం ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన కోటేశ్వరమ్మకు సమ్మయ్యనగర్‌లో కుమారులతో ఉంటూ కూలీ పనిచేసుకుంటుంది. అయితే చిన్న కుమారుడు తిరుపతి(16)కు సమాచారం ఇవ్వకుండా పెద్ద కుమారుడితోకలిసి కోటేశ్వరమ్మ గురువారం గుంటూరుకు వెళ్లింది. తనకు చెప్పకుండా వెళ్లినందుకు ఆందోళనకు గురైన తిరుపతి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

ఉత్తములకు 'ప్రశంస'లు

కరీమాబాద్: వరంగల్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి శుక్రవారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ చేతుల మీదుగా అధికారులు ప్రశంసపత్రాలు అందజేశారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఓ సిటీ సమీపంలోని ఐడీఓసీ నిర్మాణ స్థలంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ప్రశంసపత్రాలు అందించారు.



శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న అడిషనల్ డీసీపీ పి.సంజీవ్



నాగయ్య, ఏసీపీ | భాస్కర్, పరేడ్ కమాండెంట్ | ఎం.సంపత్ రావు, డీఆర్‌డీఓ



కె.విక్రమ్‌కుమార్, డీఎండబ్ల్యూఓ | డి.ఉషారాణి, జేడీఏ | శ్రీనివాసరావు, హార్టికల్చర్ ఆఫీసర్



జి.భువసింగ్, పీసీ | ఎం.భాస్కర్, పీసీ | ఎన్.నరేశ్, పీసీ



టి.శ్రీకాంత్, ఏఓ, కలెక్టరేట్ | మధుచంద్ర, సీసీ, అడిషనల్ కలెక్టర్ | బి.స్వర్ణలత, స్టెనో



రాధాకృష్ణ, ఎస్సై, ఎక్సైజ్ శాఖ | ఓబైద్, జూనియర్ అసిస్టెంట్ | ఉస్మాన్ అలీ, సీనియర్ అసిస్టెంట్



ఎంపీ రాఘవులు, వాచ్‌మెన్ | జి.శ్రీనివాస్, ఆఫీస్ సబార్డినేట్ | ఫణికుమార్, తహసీల్దార్



మధుసూదన్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మైన్స్ అండ్ జియాలజీ | పి.వినోద, ఎంపీహెచ్‌ఏ | ఎ.జ్యోతి, హార్టికల్చర్ ఆఫీసర్



రాజేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ | రామ్మూర్తి, తహసీల్దార్ | సంపత్‌రావు, ఏసీపీ



మీనా, సీనియర్ ఇన్‌స్పెక్టర్, కోఆపరేటివ్ | సింధూజ, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ | రహీముద్దీన్, సీనియర్ అసిస్టెంట్



శ్రీనివాసరావు, ఈఓ | రాజీవ్‌లోచన్, ఏఈఓ | నరేశ్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

పి.శ్రీకాంత్, ఎస్సై | ఎస్.రాజు, ఇన్‌స్పెక్టర్ | కె.పరమేశ్వరి, ఏఎస్సై